నీట్ ఫలితాల్లో మెరిసిన పిటిఎం విద్యార్థి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం విద్యార్థి నీట్ పరీక్ష ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించాడు. గురువారం విద్యార్థి తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు విదార్థిని అభినందించారు. మండలంలోని పులికల్లు పంచాయతీ, బొంతలవారిపల్లెకు చెందిన రైతు నాగరాజు కుమారుడు ఆదిత్యరెడ్డి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని విజన్ కాలేజీలో ఇంటర్ లాంగ్‌టర్మ్ తీసుకున్నాడు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షల్లో 720 మార్కులకుగాను 630 మార్కులు సాధించాడని సత్తాచాటాడు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు మాట్లాడుతూ చిన్నతనం నుండి ఆదిత్యరెడ్డికి చదువు అంటే ఎంతో ఇష్టమని, అందుకు అనుగుణంగా కష్టపడి చదివి ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించడంతోపాటు నీట్ పరీక్షలో 630 మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు. వైద్య విద్యను పూర్తి చేసి పేద ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

వైసిపిలో.. అంతర్మథనం

ఎన్నికల్లో ఘోర పరాజయంపై వైసిపిలో అంతర్మథనం నెలకొంది. ఉమ్మడి జిల్లాల్లో వైసిపి కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలు సహా చెరో రెండు అసెంబ్లీ స్థానాలు మినహా మిగిలిన తొమ్మిది స్థానాల్లో ఓటమి పాలు కావడాన్ని జిల్లా నాయకత్వం జీర్ణించుకోలేక పోతోంది. సాచ్యురేషన్ మోడ్‌లో పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించామనే భరోసాతో ఎన్నికలకు వెళ్లిన సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉక్కు పరిశ్రమ నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని విస్మరించడం మినహా సంక్షేమ పథకాలతోపాటు కొప్పర్తి, గోపవరం ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాల కల్పన చేసినప్పటికీ ఘోరపరాజయం ఎదురుకావడానికి గల కారణాలను విశ్లేషించే ప్రయత్నం జరుగుతోంది. ఘోరపరాజయానికి సంక్షేమం, ఉపాధులకు పరిమితంగాకుడా పలువురు పార్టీ నాయకులు సామాన్యుల భూములను కబ్జా చేయడం, చివరికి అధికార పార్టీకి చెందిన బద్వేల్ ఎమ్మెల్యే భూములనే కబ్జా చేయడం, వేధింపులకు గురిచేయడాన్ని ప్రతిపక్ష నేత చంద్రబాబు, మీడియాలో పెద్దఎత్తున చర్చనీయాంశం చేయడం వంటి కారణాలు ఉన్నాయనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఉరుముతోంది.

- ఘోర పరాజయ కారణాలపై ఆరా
-ఇంట గెలవలేక...రచ్చ గెలవలేక...!
-భూ కబ్జాలు.. నేతల్లో క్రమశిక్షణ కొరవడడమే?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి నేతలకు ఘోర పరాజయం ఓ పట్టాన అంతుబట్టడం లేదు. ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు దాడులకు బెదిరి తిరుపతి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి రాజంపేట అసెంబ్లీ మినహా మిగిలిన 12 స్థానాలను కైవసం చేసుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలు సహా పులి వెందుల, బద్వేలు, రాజంపేట, తంబళ్లపల్లి అసెంబ్లీ స్థానాలకు పరిమితం కావడం ఆందోళన కలిగించింది. ఇంతటి ఘోర పరాజయా నికి ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. వైఎస్ జగన్ సొంతింట్లో అంటుకున్న కుంపటిని అదుపు చేయలేకపోవడం, తల్లిని, సొంత చెల్లెల్ని నిరాధరణకు గురిచేయడం, పార్టీ నాయకుల్లో సమన్వయలోపం నెలకొనడం, పార్టీ నాయకుల అడ్డూ అదుపూ లేకుండా భూ కబ్జాలకు పాల్పడడం వంటి తప్పిదాల కారణంగా కొన్ని సామాజికవర్గాలు దూరం కావడమైంది. ఫలితంగా సుమారు 10 శాతం ఓటింగ్‌కు దూరమైంది. వైసిపి ప్రభుత్వ విద్య, వైద్యం పాలసీలు పర్వాలేకున్నా కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన వెంటనే జాతీయ విద్యావిధానం, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వంటి విధానాలను అధ్యయనం చేయకుండా అమలు చేయబూనడం ప్రధానమైన తప్పిదాలు. పేదల సంక్షేమాన్ని నమ్ముకుని, పెత్తందారీతనం కలిన పార్టీ నేతల బారిన పడిన పేదల స్థలాల కబ్జాలను కట్టడి చేయకపోవడం, నాయకుల్లో క్రమశిక్షణ కొరవడడం, పార్టీ నాయకుల వ్యవహార సరళిని విస్మరించడం, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిని కలవాలంటే తెల్లవారుజామున మూడు గంటలకు పులివెందులకు వెళ్లాల్సి రావడం, ఫోన్‌లో ఎంత ప్రయత్నించినా అందుబాటులోకి రాకపోవడం, ప్రజల సమస్యలకు పరిష్కారం లభించకపోవడం, పులివెందుల అసెంబ్లీ వాసుల సమస్యల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి అవకాశం లేకుండా పోవడం, అక్కడికి వెళ్లినా వైఎస్ జగన్ నుంచి తిరిగి ఎంపీ దగ్గరికి పంపించడం, ఎంపీ దగ్గర చెప్పుకోలేక, చెప్పినా పరిష్కారం లభించకనే జగన్ దృష్టికి తీసుకెళ్తే తిరుగుటపా ఎంపీ దగ్గరికి రావడం వంటి చర్యలతో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య ఘటనలో చెల్లెళ్లతో పేచీ పెట్టుకోవడం, సొంత చెల్లెళ్లు సోదరుని రక్తపు మరకల సర్కారును ఓడించాలనే పేరుతో ప్రత్యర్థులుగా మారి ఎన్నికల్లో ప్రచారానికి దిగడం ఘోర పరాజయానికి మచ్చుకు కొన్ని కారణాలుగా పేర్కొనొచ్చు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అన్నమయ్య, పింఛా రిజర్వాయర్లు కొట్టుకుపోవడానికి సొంత పార్టీ నాయకుని ఇసుక డంపులే కారణమని తెలుసు. అయినప్పటికీ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమని తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసు కోలేకపోయారు. గండికోట, సోమశిల, పైడిపాలెం రిజర్వాయర్ల పరిధిలోని ముంపు వాసులకు పరిహారం చెల్లింపులు చేయకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థలతో పార్టీతో కేడర్‌కు సంబంధాలు క్షీణించడం, పార్టీ కేడర్‌కు నీరు-చెట్టూ తరహా కాంట్రాక్టు పనులు లేకపోవడంతో ఉత్సాహం మందగించింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు చేయడంలో మీన మేషాలు లెక్కించడం నిర్వేదాన్ని మిగిల్చింది. ఇసుక, మద్యం వ్యవహారాల్లో గందరగోళం నెలకొంది. ఇసుక ధరల కారణంగా భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మద్య నిషేధం ప్రశ్నార్థకంగా మారింది. వైసిపి సర్కారు హయాంలో కడప, బద్వేల్, రాయచోటి ప్రాంతాల్లో భూకుంభకోణాలు అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కడపలో కీలక నేతలే సిండికేటుగా మారి కబ్జాల నేతలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. జగన్ కడప సొంత జిల్లా కావడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఇచ్చారు. కడప అసెంబ్లీ పరిధిలో నాయకుల మధ్య సమన్వయం లోపించడం, ఓటమికి దారి తీసింది. టిడిపి ప్రకటిత సూపర్ సిక్స్, మేనిఫెస్టో మహిళలను ఆకర్షించింది. వైసిపి మేనిఫెస్టోలో రైతు రుణమాఫీ ఉంటుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. సరికదా పాత మేనిఫెస్టోనే కావడంతో ప్రజలు కొత్తధనం వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. జిల్లాల విభజన అంశాన్ని పరిశీలిస్తే పార్లమెంట్ స్థానాన్ని జిల్లా కేంద్రంగా మారుస్తామని హామీ ఉల్లంఘించడం, రాజంపేటను కాదని రాయచోటిని జిల్లా కేంద్రంగా ప్రకటించడంపై సొంత పార్టీలోనే అసంతృప్తుల వెల్లువ కొనసాగింది. రాజంపేట వైసిపి అభ్యర్థి గెలవడాన్ని గమనిస్తే ఉమ్మడి జిల్లాల్లో ఓటమి పాలైన అసెంబ్లీ అభ్యర్థుల నాయకత్వ సామర్థ్యం ప్రశ్నార్థకంగా మారినట్లు అర్థమవుతోంది. రాజకీయంగా ఎన్నికల్లో పొత్తులు ఎత్తుల్లో వైఫల్యం ప్రధానంగా కనిపిస్తోంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపితో కూటమి కట్టి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. టిడిపి, జనసేన, బిజెపితో కలిసి కూటమి కట్టి ఎన్నికల్లో దిగుతోందని తెలిసినప్పటికీ, వైసిపి ఒంటరిగా ఎదుర్కోవాలనుకోవడం పిచ్చితనమా, అహంకారమో, అతి ఆత్మవిశ్వాసమో ఇతర కారణాలేమైనా ఉన్నాయోమే ఆలోచించుకోవాలి.

అమాత్య యోగం ఎవరికి దక్కేనో!

ఉమ్మడి జిల్లాల్లో కేబినెట్ బెర్త్ ఎవరిదనే అంశంపై అందరి దృష్టి నిలిచింది. కడప జిల్లాలో ముగ్గురు, అన్నమయ్య జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల్లో జిల్లాకు ఒకరికి చొప్పున మంత్రి పదవి దక్కే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. వీరిలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతోపాటు, కూటమి తరుపున పోటీ చేసి గెలిచిన అభ్యర్థులూ ఉన్నారు. వీరిలో ఎవరి ప్రాధాన్యతలు వారికి ఉన్నప్పటికీ వీరిలో ఎవరిని అమాత్యయోగం వరించనున్నదనే అంశం ఆసక్తికరంగా మారింది.

- **రేసులో కడప, మైదుకూరు ఎమ్మెల్యేలు**
- **మహిళా కోటాలో ఎమ్మెల్యే మాధవికే అవకాశం**
- **అన్నమయ్య జిల్లాలో ఎమ్మెల్యేలు నల్లారి, అరవ శ్రీధర్**

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆర్. మాధవి

పుట్టా సుధాకర్‌యాదవ్

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి కడప జిల్లా చరిత్రలోనే ఎన్నడూ ఎరగని విధంగా ఉమ్మడి కడప జిల్లాల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యే పదవులు ప్రతిపక్ష కూటమికి దక్కడం చర్చ నీయాంశంగా మారింది. కడప, అన్నమయ్య జిల్లాల పరంగా గమనిస్తే కడప జిల్లాలో పులివెందుల, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తంబళ్లపల్లి మినహా మిగిలిన తొమ్మిది స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలిచారు. ఈనెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కూటమి తరుపున కడప, మైదుకూరు, జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లాలో పీలేరు, రైల్వేకోడూరు అభ్యర్థుల్లో ఒకరికి అమాత్యయోగం దక్కే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. కడప అసెంబ్లీ చరిత్రను ఓసారి పరికిస్తే 1983 నుంచి నేటి వరకు కడప అసెంబ్లీ అభ్యర్థిగా గెలిచిన వారికి మంత్రి పదవులు దక్కడం ఆనవాయితీగా మారింది. కందుల కుటుంబానికి చెందిన ఎస్.రామమునిరెడ్డి దగ్గర నుంచి సి.రామచంద్రయ్య, ఖలీల్‌బాషా, అహ్మదుల్లా, ఎస్.బి.అంజాద్‌బాషా వరుసగా కీలక పదవులను అలంకించారు. ఇటువంటి చరిత్ర కలిగిన అసెంబ్లీ కావడంతో కడప అసెంబ్లీ అభ్యర్థిగా గెలిచిన ఆర్.మాధవికి మంత్రి పదవి వరించే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. మహిళా అభ్యర్థిని కావడం, పార్టీ కార్యక్రమాల అమల్లో చొరవగా ముందుకు తీసుకెళ్లడం, పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి అధిష్టానం దగ్గర పరపతి కలిగి ఉన్న నేపథ్యాల్ని పరిశీలిస్తే మంత్రి పదవి దక్కే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పవచ్చు. మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ బిసి కార్డును కలిగి ఉన్న నేపథ్యాన్ని కలిగి ఉండడం, పార్టీ సీనియర్లతో సంబంధాలను కలిగి ఉన్న కారణాల రీత్యా మంత్రి పదవి వరించే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. కూటమి తరుపున జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి బిజెపి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి ఆశావహునిగా మారిన నేపథ్యం ఆసక్తిని కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికి మంత్రి పదవి వరించే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయని చెప్పవచ్చు. ఇతనితోపాటు రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానానికి కూటమిలో భాగంగా జనసేన తరుపున బరిలో దిగిన అరవ శ్రీధర్‌కు జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ మంత్రి పదవికి పట్టుబట్టే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా అరవ శ్రీధర్ ఎస్సీ అభ్యర్థి కావడం, రాయలసీమలోని 52 అసెంబ్లీ స్థానాల్లో జనసేనకు ఏకైక ఎమ్మెల్యే అభ్యర్థి కావడం వంటి అర్హత, కారణాల రీత్యా మంత్రి పదవికి పట్టు బట్టే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. రాయలసీమలో జనసేన బలపడాలంటే ఉన్న మార్గాంతరం ఉన్న ఏకైక ఎమ్మెల్యే అభ్యర్థికి మంత్రి పదవి లభించే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయని చెప్పవచ్చు.



అరవ శ్రీధర్

నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అనుమతి లేని విజేత, విశ్వం, శాంతినికేతన్, ఆర్.కె కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని, ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జిఒ 1,42 అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సాయికుమార్ డిమాండ్ చేశారు. గురువారం అన్నమయ్య జిల్లా డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా పరంగా మార్చుకున్నాయని, అనుమతి లేకుండా అక్రమ అడ్మిషన్ చేస్తున్న యాజమాన్యాలకు విద్యాశాఖ అధికారులు అమ్ముడుపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కారని అన్నారు. పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాల అమ్మకానికి పెట్టిన ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని అన్నారు. కార్పొరేట్ యాజమాన్యం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని మండి పడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్స్ ఫుల్ అయ్యాయని చెప్పడం విడురంగా ఉందన్నారు. ఫీజు నియంత్రణ చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని, అడ్మిషన్ కోసం డొనేషన్లు రూ. 3500 నుంచి రూ 6000 వరకు వసూలు చేస్తున్నారన్నారు. ఎల్‌కెజి విద్యార్థికి రూ.31,000 దారుణంగా వసూలు చేస్తున్నారని వాపోయారు. బాత్రూంలను తలపించే తరగతి గదులు ఉన్నాయని చెప్పారు. ఫీజు స్ట్రక్చర్ నోటీసు బోర్డులో అంటించాలని పేర్కొన్నారు. ఒక్క పాఠశాలకు కూడా ప్లే గ్రౌండ్ లేదన్నారు. వెంటనే జిల్లా వ్యాప్తంగా సిబిఎస్‌సి అండ్ సిబిఎస్ఇ స్కూల్స్‌ను పత్రిక ప్రకటన ద్వారా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మదన్మోహన్‌రెడ్డి, ఎంఎస్ఎఫ్ శివతేజ, వెంకటేష్ ఉపేంద్ర, విజయ్ కుమార్, నాగార్జున, నాయకులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల ఫ్లెక్సీలను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఆరు నెలలుగా జీతాలు లేవు ఆదుకోండి

- ఎమ్మెల్యేకు పారిశుధ్య కార్మికుల వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : తాము ఎంతో కాలంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నామని, జనవరి నుంచి ఇప్పటివరకు ఆరు నెలలుగా జీతాలు లేక అల్లాడిపోతున్నామని కుటుంబాల్ని పోషించుకోలేక నానా అవస్థలు పడుతున్నామని, మీరైనా మాకు జీతాలు ఇప్పించి ఆదుకోండి మహా ప్రభో అంటూ మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విన్నవించారు. గురువారం ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యేను కలిసి ఆరు నెలలుగా తమకు జీతాలు లేవని.. జీతాలు మంజూరు చేసి తమను ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పారిశుధ్య విభాగపు కాంట్రాక్టర్ వీరికి జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేదంటే కాంట్రాక్టర్‌ను మార్చుతామని పారిశుధ్య కార్మికులకు సకాలంలో ప్రతి నెలా జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

ఇంటర్న్‌షిప్‌కు 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి : అంగళ్ళు సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్న లేపాక్షి, సుశాంత్‌రెడ్డి, జస్వంత్, యశ్వంత్ కుమార్, జాహ్నవి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పుదుచ్చేరిలో 6 వారల పాటు ఇంటర్న్‌షిప్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. విద్యార్థులు యొక్క సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అని, ప్రస్తుతం ఉన్న లేటెస్ట్ టెక్నాలజీ అయిన మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌పై ఈ ఆరు వారాలపాటు ఇంటర్న్షిప్ చేస్తారన్నారు. ఈ నెల 10 వ తేదీన ఈ ఇంటర్న్‌షిప్ ప్రారంభం అవుతుందని ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలియజేసారు.

ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికులకు కనీసవేతనం రూ. 18500 అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట క్లాప్ డ్రైవర్లతో కలసి నిరసన తెలిపారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గత డిసెంబర్‌లో 16రోజుల సమ్మె చేయగా వైసిపి ప్రభుత్వం దిగొచ్చి క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని జిఒ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు రాయచోటిలో అమలుకాలేదని పేర్కొన్నారు. వారికీ ఏదైనా ప్రమాదం జరిగినా బీమా లేదన్నారు. కొందరికి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, డ్రైవర్లను అప్కాస్‌లో స్వీపర్‌లుగా చూపించిన కారణంగా రూ. 24,500 వేతనం పొందలేకపోతున్నారని చెప్పారు. సంక్రాంతి బోనస్ రూ. 1000 కూడా జాప్యం చేస్తున్నారని చెప్పారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కమిషనర్‌కు త్వరలో కౌన్సిల్ ఏర్పాటు చేసి కార్మికుల అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.చెన్నయ్య, సి.రాంబాబు, సీనియర్ నాయకులు బి.వి రమణ. క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.

అన్నమాచార్య అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇఇఇ విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న షేక్ ముక్తియార్ అలీకి జెఎన్‌టియు అనంతపురం వారిచే పిహెచ్‌డి ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి. నారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాస్ట్ అలకేషన్ ఇన్ ఏ డీరెగ్యులేటెడ్ పవర్ సిస్టమ్ విత్ రిలైబులిటీ ఇండెక్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. ఈయన అన్నమాచార్య కళాశాల ఇఇఇ విభాగాధిపతి ఎం.పద్మ లలిత డాక్టర్ ఎం.పద్మలలిత, అనంతపురం జెఎన్‌టియు అధ్యాపకులు, డైరెక్టర్ ఆఫ్ ఐసిఎస్ విశాలి అనంతపురం వారి ఆధ్వర్యంలో ఈ పిహెచ్‌డి చేశారని తెలిపారు. వీరి పరిశోధన వల్ల విద్యుత్ నష్టాలు తగ్గించవచ్చునని డాక్టరేట్ పొందిన షేక్ ముక్తియార్ అలీ తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత, అధ్యాపక బృందం షేక్ ముక్తియార్ అలీని అభినందించారు.

లక్ష్మీప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కార్యాలయంలో సందడి

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటి నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేయడంతో స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు వేడుకలు నిర్వహించుకున్నారు. గురువారం రాయచోటి శాసనసభ్యుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పార్టీ కార్యాలయానికి విచ్చేయంతో కార్యకర్తలు, నాయకులతో సందడిగా మారింది. నాయకులు, కార్యకర్తలు లక్ష్మీ ప్రసాద్ రెడ్డిని అభినందించి సన్మానించారు. తన అన్న గెలుపునకు సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు ఎల్లవేళలా గాలివీడు మండల ప్రజలకు అందుబాటులో ఉంటామని, మీ రుణం తీర్చుకోవడానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

'సుగవాసి' కుటుంబాన్ని కలిసిన 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి : మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ రాయుడును బాలసుబ్రమణ్యం, టిటిడి మాజీ బోర్డు సభ్యులు ప్రసాద్ బాబును రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలదండలు, శాలువతో సత్కరించారు. తన గెలుపుకు సహకరించినందుకు రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు రాంప్రసాద్ రెడ్డిని శాలవాతో సత్కరించి రాయచోటి శాసనసభ సభ్యులుగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మండిపల్లి, సుగవాసి అభిమానులు పాల్గొన్నారు.

సుగవాసి కుటుంబ సభ్యులను కలిసిన ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటున్న పిటిఎం శివప్రసాద్

బిఎస్ఐ రాష్ట్ర కార్యదర్శిగా శివప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లి

బౌద్ధ ధర్మ వ్యాప్తి కోసం గత పదిహేను ఏళ్లుగా క్రియా శీలకంగా పనిచేస్తున్న ఉపాసక పిటిఎం శివప్రసాద్‌కు,బుద్ధిస్ట్ సొసైటీ అఫ్ ఇండి యా (బిఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షులు ఆయుష్మాన్ హరిబాబు బోధిసిరి అవార్డు ప్రదా నం చేసి, ఘనంగా సత్కరించారు. ది బుద్ధిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా (బిఎస్ఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా శివప్రసాద్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ది బుద్ధిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా (బిఎస్ఐ)ను 1955లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఏర్పాటు చేశారు. భారతదేశంలో బౌద్ధం పునరుద్ధరణ కోసం బుద్ధిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా ఎంతో క్రియాశీలకంగా పనిచేస్తోంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా స్థాపించిన బుద్ధిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా సంస్థలో తనకు రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యత అప్పగించడం తన సుకృతంగా భావిస్తున్నట్లు శివప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన బిఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబుకు శివప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. శివప్రసాద్‌ను బిఎస్ఐ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంపై ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, అన్నమయ్య జిల్లా బిఎస్ఐ అధ్యక్షుడు కె.వి.రమణ, బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, విసికె పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి పాలకుంట శ్రీనివాసులు, బుద్ధ అంబేద్కర్ సమాజ్ ట్రస్ట్ సభ్యులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, సొన్నికంటి రెడ్డెప్ప హర్షం ప్రకటించారు.

మురుగు కాలువపై కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక పంచాయతీలోని రవిచంద్ర పాఠశాలకు వెళ్లే వీధిలో ఉన్న ప్రధాన మురుగు కాల్వపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కల్వర్టు నిర్మించామని సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. గతంలో మురుగు నీరంతా వీధులోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారని, వార్డు సభ్యురాలు మాతమ్మ తమ దృష్టికి తీసుకురావడంతో కొద్ది రోజుల్లోనే కల్వర్టును నిర్మించామని చెప్పారు. పంచాయతీలోని ప్రజలు ఏ సమస్యతోనూ బాధపడకూడదనే ఉద్దేశంతో సకాలంలో చర్యలు తీసుకున్నామని, గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తామని ఆమె పేర్కొన్నారు.



ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కాను సన్మానిస్తున్న నాయకులు

రైల్వేకోడూరులో అభివృద్ధి చేసి చూపిస్తాం

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి 'ముక్కా', ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. గురువారం పట్టణంలోని గంగమ్మ దేవాలయంలో టిడిపి సీనియర్ నాయకులు బత్యాల చెంగల్రాయుడులతో కలిసి పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలువురు టిడిపి ముఖ్య నేతలు కట్టా గుండయ్యానాయుడు, గడికోట సుబ్బరాయుడు, నాగయ్య నాయుడు, తదితరులు రూపానందరెడ్డి, శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పాత బస్టాండ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం ముందు ట్రాఫిక్ సమస్యకు ఏర్పాటు చేసిన బారికెడ్లను పరిశీలించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పూర్తి స్థాయిలో అభివృద్ధి పైన దృష్టి సారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నీలకంఠయ్య, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, తిమ్మిశెట్టి మణి, కొప్పరపు అరవింద్, రాజశేఖర్ రాజు, హేమరాజ్, నవీన్ పాల్గొన్నారు.

అందుబాటులో నాణ్యమైన పండ్ల మొక్కలు

ప్రజాశక్తి-కలికిరి

రైతులకు అందుబాటులో నాణ్యమైన పండ్ల మొక్కలు ఉన్నట్లు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బయన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల కలికిరిలో 2009 సంవత్సరంలో ప్రారంభమైనప్పటి నుండి విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సులతో పాటు రైతులకు ఉద్యాన పంటలపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వీటితోపాటు నర్సరీ ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన వివిధ రకాల కూరగాయలు, పండ్లు మొక్కల కూడా రైతులకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. మామిడి రకాలైన బెనీష, మల్లిక, తోతాపురి, నేరేడు అంటు మొక్కలైన మునగ అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని కళాశాల తెలిపారు. ఆసక్తి గల రైతులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

టిడిపి విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-కలకడ

తెలుగు తమ్ముళ్లు విజయోత్సవ ర్యాలీలను అంగరంగ వైభవంగా అట్టహాసంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రమైన కలకడ, కోన, బాట వారిపల్లి, కదిరాయి చెరువు, నడిమిచర్ల, ఏనుగొండపాలెం, రాతిగుంటపల్లి, దేవులపల్లి, బాలయ్యగారిపల్లి, గుడిబండ, తదితర ప్రాంతాలలో విజయోత్సవ ర్యాలీలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. పీలేరు నియోజకవర్గం నుండి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి 25 వేల పైచిలుకు ఓట్లతో ఎమ్మెల్యేగా గెలవడంతో మండలంలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, ముస్లిం మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా ర్యాలీలు నిర్వహించిన తెలిపారు. ఈ ర్యాలీలలో టపాకాయలు కాల్చి, కేకులు కట్ చేసి విజయోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కలికిరి: రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి విజయకేతనం ఎగురవేయడంతో మండలంలోని గుట్టపాలెం గ్రామంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు వాడవాడల కేక్ కట్ చేసుకుని ఊరేగింపు నిర్వహించారు. ఈ సందరరేగా మాజీ సర్పంచ్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, ధరలు ఆకాశాన్ని అంటాయని, సామాన్య ప్రజలు, నిరుద్యోగులు ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారని, వ్యవసాయం కుంటుపడిందని, చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వచ్చే కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా చూస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కె.బర్నేపల్లిలో జనసేన, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ వెంకట రమణ, మాజీ ఎంపిటిసి, బయన్న, నాగరాజ, దామోదర, విజయకుమార్, కరుణాకర్, నరసింహులు, బాలకృష్ణ, మునేంద్ర, గోవిందు పాల్గొన్నారు.

కలకడలో విజయోత్సవాలు చేసుకుంటున్న నాయకులు

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా వ్యాఖ్యానించారు. గురువారం ఉదయం ఆయన సర్వజన బోధన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగం నుంచి వార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రతి రోగిని ఆత్మీయంగా పలకరించారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయి.. ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా.. ఎవరైనా మిమ్మల్ని డబ్బులు అడుగుతున్నారా.. లాంటి సమాచారాన్ని నేరుగా రోగుల తోనే ఆరా తీశారు. అనంతరం వార్డులలోని మరుగుదొడ్లను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. వార్డుల్లో పారిశుధ్య పనులు చాలా అధ్వానంగా ఉన్నాయని, చాలా దుర్వాసన వెదజల్లుతోందని, సానిటరీ విభాగం చాలా ఘోరంగా పనిచేస్తుందని మండిపడ్డారు. వెంటనే సానిటరీ కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపాలని మెడికల్ సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజును ఆదేశించారు. అనంతరం వార్డుల్లో ఉన్న రోగులను పలకరిస్తూ ఏ వ్యాధితో ఇక్కడికి వచ్చారు. ఎలాంటి చికిత్స అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. చికిత్సల కోసం వచ్చే పేదలకు అన్ని వైద్య పరీక్షలు ఇక్కడే చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ వైద్య పరీక్షలు బయట చేయిస్తే వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద అన్ని బిల్లులు మంజూరు చేసి వారిపై ఎలాంటి భారం పడకుండా చూడాలని సూపరిన్ టెండెంట్‌కు సూచించారు. అనంతరం హాస్పిటల్ పైన మెడికల్ కాలేజ్ నిమిత్తం ఇటీవల నూతనంగా నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం చాలా నాసిరకంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. ఇంత నాసిరికంగా నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు ఎలా చూస్తూ ఉండిపోయారని ప్రశ్నించారు. పనులు ఇంకా బాగా చేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుందని ఎంతోమంది పేదలు ఇక్కడికి వస్తున్నందున వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడంలో తెలుగుదేశం ప్రభుత్వం ముందు ఉంటుందని తెలిపారు. తాను ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు వైద్యులు వైద్య సిబ్బంది తమ విధుల్లో ఉన్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎమ్మెస్ రాజు, ఆర్ఎంఒ ప్రసాద్ రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగులతో సమస్యలు తెలుసుకరుంటున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

'బిసిజి టీకాతో క్షయ వ్యాధి అంతం'

కలకడ : వృద్ధులకు బిసిజి టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలకడ

బిసిజి టీకాతో క్షయ వ్యాధికి అంతం కావడం ఖాయమని డాక్టర్ ఎం.వి.కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముడియంవారిపల్లెలో వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎర్రకోటపల్లి పిహెచ్‌సిలోని సింగనోడ్డుపల్లి, బొజ్జుగుంటపల్లి, చెరువు ముందరపల్లి, ముడియంవారిపల్లి, రంగప్పాగారిపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న వయోజన బిసిజి టీకా కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజరైన ప్రజలకు క్షయ వ్యాధి లేని భారతదేశం యొక్క లక్ష్య సాధన కొరకే వయోజన బిసిజి టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టినదని తెలిపారు. అనంతరం ప్రజలకు వయోజన బిసిజి టీకాపై ఎంపిహెచ్ఇఒ జయరామయ్య అవగాహన కల్పించారు. భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా టిబి మరణాల తీవ్రతను నివారించడంలో బిసిజి టీకా చాలా సురక్షితమైనదని, క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి, పెద్దలలో టిబి నుండి రక్షణ ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకారి అని ఎవరు ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా వేసుకోవచ్చునని పేర్కొన్నారు. 60 ఏళ్లు పైబడిన వయసుగల వారు, ధూమపానం సేవించువారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టిబి జబ్బుతో కోలుకున్న వారు, వారి కుటుంబ సభ్యులకు, వీరు టీకాకు అర్హులని తెలిపారు. రోజు వారీ పనికి ఆటంకం, అసౌకర్యం గాని ఉండదని,ప్రభుత్వం అన్ని సాధారణ వైద్య సేవల్లో, ఆరోగ్య సంరక్షణకు చాలా మంచి కార్యక్రమమని జరుగుతున్నదని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎర్రకోటపల్లి అడల్ట్ బిసిజి టీకా టార్గెట్ 7751 కాగా ఇప్పటివరకు 666 10 శాతం మందికి వేసుకొనినట్లు ఆరోగ్య విస్తరణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పిహెచ్ఎన్ సుబ్బరత్న, బి.రెడ్డమ్మ, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు, ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కలికిరి: క్షయ వ్యాధి లేని భారతదేశం యొక్క లక్ష్య సాధన కొరకే వయోజన బిసిజి టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టినదని మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కావ్య గంధ అన్నారు. మండలంలోని ఆర్ఎస్‌రోడ్, కలికిరి 4, కె.బరినేపల్లిలలో పెద్దల బిసిజి టీకా సెషన్‌ను సందర్శించిన ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, వాల్మీకిపురం టిబి యూనిట్ పర్యవేక్షకులు నాగిరెడ్డి బిసిజి టీకాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు కృష్ణకుమారి, పావని, ఎఎన్‌ఎంలు మాధవి, రమాదేవి, ఆశ కార్యకర్త జ్యోతి, దీన, లాలిత, అంగన్వాడీ టీచర్ స్రవంతి ప్రజలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : బిసిజి టీకా వేసుకోవడం ద్వారా టిబి నుండి పూర్తిస్థాయి రక్షణ పొందవచ్చునని పిటిఎం మండలం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శంకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇది కొత్త టీకా కాదని, పుట్టిన బిడ్డకు ఈ టీకా 24 గంటలకు లోపల వేస్తున్నామని, దానివల్ల చిన్న పిల్లలలో టిబి అనే వ్యాధి అరుదుగా వస్తుందన్నారు. అర్హులయినా వారందరు ఈ టీకా వేయంచుకుని టిబి నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవాలని కోరారు.

మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విచారిస్తాం

- మాజీ కో-ఆప్షన్ సభ్యులు సలావుద్దీన్

ప్రజాశక్తి-రాయచోటి

గత ప్రభుత్వంలో మున్సిపాలిటీలో చేసిన అవకతవకలను విచారణ చేపడతామని మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ సభ్యులు సలావుద్దీన్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన చూసి ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించారని పేర్కొన్నారు. గడిగోట శ్రీకాంత్‌రెడ్డి నాలుగు సార్లు రాయచోటికి ఎమ్మెల్యేగా పనిచేసినా ఆయన రాయచోటి నియోజకవర్గానికి చేసింది శూన్యమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆయనను చిత్తుగా ఓడించి ప్రజలకు అందుబాటులో ఉన్నటువంటి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారని చెప్పారు. రాయచోటి అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడు రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాయచోటి మున్సిపాలిటీలో అధిక పన్నులు వసూలుతోపాటు నాణ్యతలేని పనులు చేపట్టారన్నారు. భూగర్భ డ్రెయినేజీ పనులు 20 శాతం కూడా పూర్తి చేయకుండా ఊరు బయట పనులు చేయడం బాధాకరమని వాపోయారు. త్వరలో మున్సిపాలిటీలో జరిగిన అవినీతిని విచారణ చేపడతామని తెలిపారు. తప్పులు చేసిన వారిని చట్టపరంగా శిక్షించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులు ఆసిఫా ఉల్లా ఖాన్, టిడిపి నాయకులు వాహిద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సలావుద్దీన్

రైతు సమస్యలపై నిరంతర పోరాటం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

రైతుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని, సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా రైతు సంఘంలో చేరాలని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలో కొలుమూలపల్లె పంచాయితీలో రైతు సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారం కోసం రైతు సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. రైతులు ఎంతో కష్టపడి పంటలు పండిస్తున్న కష్టానికి తగిన ప్రతిఫలం రాకపోగా అప్పులు ఆత్మహత్యలు మిగులుతున్నాయన్నారు. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఎరువులు పురుగుమందులు వ్యవసాయ పరికరాలు పెట్రోల్ డీజిల్ రవాణా ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయని వాపోయారు. దేశానికి రైతే వెన్నెముక అంటూనే వెన్నెముక విరిగిపోయేలా ప్రభుత్వాలు భారాలు వేస్తున్నాయని ఆయన తెలిపారు. రైతు సంఘం రైతాంగ సమస్యలపై శక్తి మేరకు నిరంతరం పోరాడుతోందని, భూనిర్వాసిత రైతులకు అండగా నిలబడుతుందని, ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోయిన సందర్భాలలో నష్టపరిహారాల కోసం, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కోసం ధర్నాలు రాస్తారోకోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహించిందని ఆయన తెలిపారు. భూసేకరణ పేరుతో రైతుల భూములను తక్కువ నష్టపరిహారం ఇచ్చి బలవంతంగా లాగేసుకుంటున్నారని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కొరత కారణంగా సాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయని ఆయన అన్నారు. మన సమస్యల పరిష్కారానికి రైతు సంఘాన్ని మరింత బలపరుచుకోవాలని, మన సమస్యలన్నీ ప్రభుత్వాలు పరిష్కరించేలా విస్తృత ఆందోళన నిర్వహించాలని చెప్పారు. రైతులందరూ రాజకీయాలకతీతంగా ఐక్యం కావాల్సిన అవసరమెంతైనా ఉందని, రైతులు, రైతు కుటుంబ సభ్యులందరూ రైతు సంఘంలో సభ్యులుగా చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య సికేదిన్నె మండల అధ్యక్షులు చిన్న సిద్దయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు

రైతు సంఘం సభ్యత్వ నమోదులో దస్తగిరిరెడ్డి

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-రామాపురం : కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని చిట్లూరు పంచాయతీ పరిధిలో కొండవాండ్లపల్లి రోడ్డు సమీపంలో గురువారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వి.ఎల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. వివరాలు.. ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ ద్వారా రాయచోటికి తరలిస్తూ ఉండగా ముందస్తు సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, రామాపురం పోలీసులు వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ట్రాక్టర్‌ను రామాపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : హెలెన్ కిల్లర్ కాలేజీ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, కడప డిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి. దౌలత్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు కేంద్ర ప్రభుత్వ రిహాబియుటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిందని తెలిపారు. కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ లేదా సమాన కోర్సు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఓసి విద్యార్థులు 50 శాతం, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, పిహెచ్‌డి విద్యార్థులు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. కోర్స్ చేసినవారు చెవిటి, మూగ బాలబాలికల ప్రత్యేక పాఠశాలలు, ఇంక్లూజు స్కూల్స్, భవిత కేంద్రాలలో ఉపాధ్యాయులుగా పనిచేయడానికి అర్హులని పేర్కొన్నారు. కోర్సులో చేరదలచిన వారు ఈనెల 14 లోపు దరఖాస్తులను హెలెన్ కిల్లర్స్ కాలేజీ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ రాజు గృహకల్ప రోడ్, సెంట్రల్ జైలు దగ్గర రామాంజనేయపురం కడపలో అందజేయాలని తెలిపారు.

వైవీయూ ఎల్ఎల్‌బి ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైవీయూఎల్ఎల్‌బి 3,5 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింత సుధాకర్ గురువారం విడుదల చేశారు. విసి ఛాంబర్‌లో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి ఫలితాల విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎల్ఎల్‌బి ఐదేళ్ల కోర్సులో మూడో సెమిస్టర్ పరీక్షలో 50 శాతం, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 74.68 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మూడేళ్ల ఎల్ఎల్‌బి కోర్సుకు సంబంధించి మూడో సెమిస్టర్‌లో 67.37 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఐదవ సెమిస్టర్‌లో 70.55 శాతం మంది పాసయ్యారని తెలిపారు. వీటితోపాటు ఎల్ఎల్‌బి (ఐదేళ్ల డిగ్రీ) 7,9 సెమిస్టర్ ఫలితాలు వెల్లడించారు. 7 సెమిస్టర్ లో 87.32 శాతం మంది, 9 సెమిస్టర్ లో 80.34 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారి గంగయ్య పాల్గొన్నారు.

NOTICE
Order 21 Rule 54(A)
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PILER
OEP NO.69 OF 2015
O.S.NO.41 OF 2009
Y.Madan Mohan Reddy.
...Petitioner/Decree Holder
Vs
M.V.Prakash (died) and 3 others.
...Respondents/Judgment Debtor
NOTICE TO J.DR.NO.3&4
3. M.Mrudulatha, D/o late M.V.Prakash,
4. M.Bhavya, D/o late M.V.Prakash,
3&4 All are r/at R.S.Road, Kalikiri Town, Post & Mandal, Annamayya District.
Whereas you have failed to satisfy a decree passed against you on the SCJ Court, Piler, in OS No.41/2009 in favour of D.Hr. It is ordered that you the said J.Drs be and hereby are prohibited and restrained untill the further order of the court from transferring of Charging the property specified in the scheduled hereunder unnexed by sale, gift or therwise and that a persons and that they are hereby prohibited from recieving the same by purchase, gift or otherwise. It is also ordered that you should attend Court on the 21.06.2024 to take notice of the date fix for setting the terms of the proclamation of sale.
//By Order of the Court//
SCHEDULE
Annamayya District- Kalikiri sub-District- Kalikiri town & Mandal, Kalikiri gram panchayath, house bearing No.4-141,4-142,4-143 with in the following boundaries.
East: Chanchuramaiah house and Sandu dari,
West: Rathnamma House, South: Prabhakar House, North: Chenchuramaiah Compound.
2. House bearing No.4-144, 4-145 within the following boundaries:
East: Sampathy Swamy house, West: Chenchuramaiah house and Sandu dari, North: Mangal Gopal and Others houses, South: C.V.Reddy house,
3. House bearing No.4-20 within the following boundaries.
East: R.S.Road, West: Road, North:Chenchu ramaiah House, South: Grandhalayam
4. Vacant site in S.No.479/3, 479/5, 479/2 extent of Ac.0.74 cents, near Yellamma Temple with in the following boundaries. The share of the D.Hr.1/24th Share.
East: Kalikiri Cheruvu, West: Muvvalavari Sathram and house, North: Muvvalavari Sathram and house, South: Nallavaripalli.
K.SUDHAKAR REDDY B.A., B.L.,
P. JAGAN MOHAN REDDY B.A., B.L.,
Advocates, PILER.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :: PILER
I.A.No. 179 of 2023
O.S.No. 109 of 2018
1) Sir P.Ramakrishna reddy
2) L.K.Visweswara Rao
...Peitioners/Plaintiffs
Vs
Smt.Mure Saval Reddy Rani.
...Respondent/Defendant
NOTICE TO RESPONDENT
To,
Smt.Mure Saval Reddy Rani, W/o Narem ANIL Kumar, Residing at Kothapalli Village, H/o Tati guntapalli, Murevandlapalli Post and Valmikipu ram Mandal, Annamayya District.
Whereas the above-named Petitioners/Plaintiffs have filed the above petition against you for passing of Final Decree as per the terms of Prelim inary Decree in the above case and the same is stands posted for your appearance on 27-06-2024. Please take notices and appear before the above said Hon'ble court on 27-06-2024 at 10-30 A.M, either in person or through an Advocate and file your objections, failing which matter will be heard and decided on merits in your absence.
//By Order of the Court//
M.R.VENKATA RAMANA REDDY, B.Sc., L.L.B.,
Counsel for Petitioners/Plaintiffs

కేక్ కట్ చేస్తున్న జనసేన కార్యకర్తలు, నాయకులు

కూటమి గెలుపు ప్రగతికి మలుపు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్యారాజుపేట పెరివరంలో గురువారం మండల జనసేన నాయకుడు పసుపులేటి వెంకటరమణ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యేగా గెలుపొందిన అరవ శ్రీధర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా టపాసులు కాల్చి, కేక్ కట్ చేసి, మిఠాయిలు, స్వీట్స్ పంచిపెట్టడం జరిగింది. ఈ సందరరేగా వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించడం జరిగిందని తెలిపారు. గెలుపొందిన ప్రతి ఒక్కరు కార్యకర్తలను నాయకులను దృష్టిలో ఉంచుకొని పరిపాలన సాగించాలన్నారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు వచ్చిన తక్షణమే స్పందించాలన్నారు. గ్రామ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకుని వస్తే తాము పై అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు భారీగా పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ప్రజలు స్వేచ్ఛగా సమస్యలు తెలియజేయవచ్చు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్‌డిఎ కూటమి అఖండ మెజారిటీతో విజయం సాధించి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కారణంగా ఇకపై రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసుకునే అవకాశం ఏర్పడిందని టిడిపి పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ అన్నారు. రాజంపేట లీగల్ సెల్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో న్యాయవాదులు సింగంశెట్టి కృష్ణకుమార్, పలుకూరి రామాంజనేయులు, కందుల వెంకటరమణ, వెంకటస్వామి, కట్టి సుబ్బరాయుడు, అబ్బూరి ప్రభాకర్ నాయుడు, మల్లిఖార్జున అక్షయ్ కుమార్, సూర్య చైతన్య, మురళి తదితరులు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న ల్యాండ్ ఆఫ్ టైటిలింగ్ యాక్ట్ గురించి మాట్లాడి ప్రమాణ స్వీకార కార్యక్రమంలోని ఈ చట్టాన్ని రద్దు చేసేలా ముఖ్యమంత్రి సంతకం చేయాలని కోరారు. 175 అసెంబ్లీ స్థానాలకు గానూ, 164 స్థానాలలో గెలుపొందిన కూటమి అభ్యర్థులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాజంపేట సీటు కోల్పోవడం దురదృష్టకరమని తెలిపారు. చంద్రబాబు జిల్లా కేంద్రం, వైద్య కళాశాల, అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం వంటి హామీలు ఇచ్చినా ఇక్కడ గెలిపించుకోలేకపోవడంతో బాబు, పవన్, లోకేష్ వద్దకు వెళ్లడానికి సిగ్గుపడుతున్నామని తెలిపారు. ప్రజలందరి సహకారంతో అవి సాధించుకునేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

పూర్తయిన పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం

పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 40 వైద్య పరీక్షలు నిర్వహించుకోవడానికి దాదాపు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టి బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. గురువారం ముందు భాగమున సిసి రోడ్డును ఏర్పాటు చేశారు. త్వరలో మిగిలిన చిన్న చిన్న మరమ్మతులు పూర్తి చేసి మండలంలోని ప్రజలందరికీ ఎంతో ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తీసుకొస్తామని స్థానిక వైద్యాధికారి రఫిక్ పేర్కొన్నారు గతంలో హెచ్ఐవి, టిబి వంటి పరీక్షలు జిల్లా కేంద్రానికి రిపోర్టు పంపేవారని, ఇక నుంచి ఇక్కడే వైద్య పరీక్షలు చేసుకోవడానికి భవనం ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజల సహకారంతోనే వ్యాధుల నిర్మూలన సాధ్యం

- డబ్ల్యూహెచ్ఒ ప్రత్యేక ఆరోగ్య పరిశీలకులు డాక్టర్ డానీ ఫ్రాంక్లిన్

ప్రజాశక్తి-పీలేరు

ప్రజల సహకారంతోనే వ్యాధుల నిర్మూలన సాధ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రత్యేక పరిశీలకులు డాక్టర్ డానీ ఫ్రాంక్లిన్ అన్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య విభాగం క్షయ వ్యాధి నిర్మూలనకు ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వయోజనుల బిసిజి టీకా క్షేత్ర స్థాయిలో పంపిణీ, వాటి పనితీరు, పరిశీలనకు గురువారం తలుపుల పిహెచ్‌సి పరిధిలోని మేళ్లచెరువు, పీలేరు పట్టణం, బండ్లవంక సచివాలయంలో నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ సెషన్ ను డాక్టర్, వారి బృందంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీకా, దాని పనితీరు, ప్రజలకున్న అవగాహన, ప్రజల స్పందన, సిబ్బంది లబ్ధిదారులకు టీకా ఇచ్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని రిశీలించారు. వీధి నిర్వహణలోని ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే బిసిజి టీకాలు ఎవరికి ఇవ్వాలి, ఎవరికి ఇవ్వకూడదు అనే విషయాలను కూడా తెలియజేశారు. ఇంటింటి సర్వేలో భాగంగా గుర్తించిన ప్రతి లబ్ధిదారులకు బిసిజి టీకాలు సద్వినిగం చేసుకుని టిబి రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, పీలేరు టిబి యూనిట్ అధికారులు, క్షేత్ర స్థాయి పి.హెచ్.సి పర్యవేక్షకులు, ఎఎన్ఎం, సిహెచ్ఒ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డబ్ల్యుహెచ్ఒ అధికారి